# నిన్న - రేపు

పంకజాక్షి తన మనవడు, మనవరాలు ఆడుకోవడం చూస్తోంది. సుధీర్ ఐదేండ్ల వాడు, సుప్రియ ఏడేండ్ల పిల్ల. ఇంటి ఎదురుగానే పార్కు. బాల్కనీలో నిలుచుంటే చాలు కావలసినంత కాలక్షేపం. ఉదయాలు, సాయంకాలాలు మరీ బాగుంటాయి. పిల్లలు ఉరుకులు పరుగులు బెడుతూ ఆడుతుంటారు. పెద్దలు ఏదో పెద్ద పని ఉన్నట్లు చాలా గంభీరంగా నడిచేస్తుంటారు. కొందరు కసరత్తులు చేస్తూ వుంటారు. మరి కొందరు కబుర్లు చెప్పుకొంటూ బెంచీలమీద, పచ్చగడ్డిలో కూర్చుని ఉంటారు. పంకజాక్షి కూడా ఉదయం పూట అలా పార్కులో తిరిగి వస్తూ ఉంటుంది. ఈ ఊరు కొత్త. ఇరుగూ పొరుగుతో తనకు అంత పరిచయం లేదు.

సాయంకాలాలు మాత్రం బాల్కనీలో కూర్చుని పార్కులోకి చూడటమంటే తనకు చాలా సరదా. తనకు తెలియకుండానే సమయం గడచిపోతూ ఉంటుంది. ఇప్పుడు పంకజాక్షి ఉయ్యాల ఊగుతున్న తన మనవరాలినే చూస్తోంది. అంత చిన్న పిల్ల ఏ మాత్రం భయంలేకుండా అంతెత్తుకు ఊగుతోంది. తన శక్తినంతా దానిమీదే కేంద్రీకరించి ఊగుతోంది. ఉయ్యాలలో కూర్చోనైనా లేదు. నిల్చునే ఊగుతోంది. చుట్టూ ఉన్న పిల్లలు గొడవ చేస్తున్నారు. "దిగు, దిగు సుప్రియా, మమ్మల్నీ ఊగనీ. నీ తర్వాత నేను. ఆ తర్వాత నా తమ్ముడు" ఇలాగే ఏవేవో మాటలు కలగాపులగంగా వినిపిస్తున్నాయి. అప్పుడు... అప్పుడే అలా జరిగింది.

సుప్రియ ఎంతో ఎత్తుకు ఊగినదల్లా ఆ ఎత్తునుండి ధడాలున కిందకు దూకేసింది. అందరూ కెవ్వున అరిచారు. పంకజాక్షి గుండె అదిరిపోయింది. మెట్లు దిగి ఆదరాబాదరా కిందకు పరుగెత్తుకొంటూ వచ్చింది. పిల్లల గుంపును ఇటూ అటూ చేతులతో విడదీస్తూ, వెళ్ళి సుప్రియను లేవనెత్తబోయింది. ఆ పిల్ల అప్పటికే లేచి ఇసుక దులుపుకొంటూ నవ్వుతోంది. స్నేహితులతో కబుర్లలో పడిపోయింది.

"ప్రియా, దెబ్బ తగల్లేదు కదా, అంత ఎత్తునుంచి ఎందుకు దూకావే?" అని అడిగింది పంకజాక్షి. .

"ఇది నాకు మామూలే అమ్మమ్మా. చూసేవాళ్ళకు భయమేస్తుందంతే. నా కసలు భయం లేదు. కొంచెం కూడా దెబ్బ తగలదు. కాళ్ళు కిందకు పెట్టి ఇలా దూకాలి" అని కొద్దిగా గెంతి చూపించింది సుప్రియ.

"చాల్లే, నీకు మరీ భయమూ, భక్తీ లేకుండా పోయింది. మీ అమ్మ పెంపకం మరి. పిల్లల్ని కొంచెమయినా అదుపులో పెట్టేకదా!"

"ఓ అమ్మమ్మా, నువ్వు మరీను. ఆటలంటే ఏమనుకొన్నావు? దెబ్బ తగులుతుంది, కాలు విరుగుతుంది, చెయ్యి విరుగుతుంది అని భయపడితే ఎవరూ ఏ గేమ్సూ ఆడలేరు. ఏ ఆటా ఆడకపోయినా తగిలే దెబ్బలు తగులుతాయి కదా అమ్మమ్మా. ఈ ఉయ్యాల సంగతే చూడు. మా మొత్తం స్కూల్లో నేను ఊగే ఎత్తుకు ఎవరూ ఊగలేరు. అంత ఎత్తునుండి ఎవరూ దూకలేరు."

"చాల్లే తల్లీ, నా గుండె ఆగిపోయిందనుకో. ఎంత గాభరా పెట్టేశావు! అయినా ఇదేమి ఆట? ఇక ఇంటికి పద. చీకటి పడుతోంది. మరల మీ అమ్మ నిన్ను హోంవర్కు చేయలేదని కోప్పడుతుంది. నీ తమ్ముడేడీ? వాడిని కూడా పిలు. ఇంటికి వెళ్దాం" అంది పంకజాక్షి.

"వాడెప్పుడో వెళ్లిపోయాడు అమ్మమ్మా" అంటూ పంకజాక్షి వెంట నడిచింది సుప్రియ. "ఇంకెప్పుడూ అంత ఎత్తునుండి దూకొద్దు. ఎప్పుడో కాలో చెయ్యో విరుగుతుంది, అప్పుడు ఏడ్చి లాభం లేదు. అయినా మీ స్కూల్లో మీరు ఆడుకొంటూ ఉంటే మీ టీచర్లు ఎవరూ ఉండరా?"

"ఉంటారు అమ్మమ్మా! వాళ్ళెక్కడో ఉంటారు. వాళ్ళెవరూ చూడనప్పుడే అలా దూకేది."

"వద్దమ్మా, ఎప్పుడూ అలా చెయ్యకు. బంగారుతల్లివి. నా మాట వింటావు కదూ." సుప్రియ అమ్మమ్మ భయానికి నవ్వుకొంటూ లోపలికి నడిచింది.

పంకజాక్షి వద్దనుకొన్నా ఆ రాత్రంతా సుప్రియ గురించి, ఉయ్యాల గురించి ఆలోచనలు వస్తూనే ఉన్నాయి. తను కొన్నాళ్లు కూతురి దగ్గర ఉండి పోదామని వచ్చింది. కొడుకు ఉద్యోగరీత్యా మధ్య ప్రదేశ్‌లో ఉన్నాడు. తను ఉండేది అక్కడే. అప్పుడప్పుడు కూతురిని చూడటానికి వస్తూ ఉంటుంది. ప్రస్తుతం అల్లుడి ఉద్యోగం ఢిల్లీలో. కూతురు కూడా ఏదో పార్ట్ టైం ఉద్యోగం చేస్తూ ఉంది.

పంకజాక్షి పుట్టి పెరిగింది ఒక పల్లెటూర్లో. తనకు చదువూ అంతంత మాత్రమే చెప్పించారు. చిన్న పిల్లగా బొమ్మలాటలు, అచ్చనగాయాలు, గవ్వలు ఆడుకోవటంతో పాటు ఉయ్యాల ఊగటమంటే కూడా పంకజాక్షికి చాలా ఇష్టంగా ఉండేది. వాళ్ళింటి ముందు ఒక చింత చెట్టు ఉండేది. దానికి ఉయ్యాల కట్టి ఇరుగు పొరుగు పిల్లలు ఆడుకొంటుండేవారు. తనూ ఎప్పుడైనా వాళ్ళతో కలిసేది.

అది నాన్నగారు ఇంట్లో లేనప్పుడు మాత్రమే. వాళ్ళమ్మయితే చూసీ చూడనట్లుండేది. కాని నాన్నగారు తనను ఉయ్యాల జోలికి వెళ్ళనిచ్చేవారు కారు.

"ఆడపిల్ల. అది కాలో చెయ్యో విరుచుకొంటే మరేమయినా ఉందా" అనేవారు అమ్మతో. కాకపోయినా ఆయన ఊహలే వేరు. చిన్నప్పటినుండి ఆడపిల్ల ఉరుకులూ, పరుగులూ తగ్గించి పనీపాటా నేర్చుకోవాలట. "మొక్కయి వంగనిది మానై వంగుతుందా?" అనేవారు. ఆడపిల్ల నడిస్తే చప్పుడు కాకూడదట. ఒద్దికగా ఉంగరంలో ఇమిడిపోయేలా ఉండాలట.

ఆ ఇంట్లో వాళ్ళకు నాన్నగారి మాటే శిలాశాసనం. ఆయన ఇంట్లో ఉంటే ఎవరూ అల్లరి చెయ్యరు. గొంతెత్తి మాట్లాడరు. పకాలున నవ్వరు. కూనిరాగాలు తియ్యరు. మిద్దెపైన గెంతరు. అంతా గప్ చిప్.

ఉష్!

పంకజాక్షి అన్ని నియమాలకూ కట్టుబడింది. తనకదేమీ కష్టమనిపించలేదు. "ఇది ఏమిటి?" అని ఎవరినీ ప్రశ్నించలేదు. ప్రశ్నించాలనీ తను అనుకోలేదు. కాని ఉయ్యాల మాత్రం తనను ప్రలోభపెడుతూనే ఉంది.

తమ్ముడు పుట్టినపుడు తను చాలా చిన్నది కాబట్టి తనకు ఉయ్యాల సౌఖ్యం తెలీదు. కాని చెల్లెలు పుట్టేప్పటికి పంకజాక్షికి ఏడేండ్లు. చెల్లెలిని ఊపే నెపంతో తనూ ఉయ్యాలలో కూర్చునేది. కాని పెద్దవాళ్ళు చూస్తే తనను కోప్పడేవారు. అందుకే ఎవరూ లేకుండా చూసి తను ఉయ్యాల తొట్టి అంచున కూర్చుని ఊగేది. అందరూ ఉంటే మాత్రం పంకజాక్షి చేతులు కనీసం ఉయ్యాల తాడైనా తాకుతూ ఉండేవి తనకు తెలియకుండానే. చెల్లెలు ఉయ్యాలలో లేకపోయినా ఉయ్యాల ఊపుతూ ఉండేది.

ఎవరైనా చూస్తే మాత్రం "అలా ఉత్తి ఉయ్యాల ఉపితే పాపకు తల నొప్పి వస్తుందమ్మా ఊరుకో" అనేవారు. ఆ విధంగా దానికీ ఆంక్షలు విధించారు.

చెల్లెలు కొంచెం పెరిగేసరికి ఇంట్లోనుండి ఉయ్యాల కూడా మాయమయింది. చింతచెట్టు ఉయ్యాల సంగతి సరేసరి. ఇప్పుడు అమ్మ కూడా కోప్పడటం మొదలుపెట్టింది. "ఇంకా 'ఉయ్యాలా, జంపాలా' అంటూ చిన్న పిల్లల చేష్టలేమిటి? ఆ సుభద్రమ్మ కూతురు చూడు! ఎంత చక్కగా ఇంటిపనులు చేసుకొంటుందో. వాళ్ళమ్మకు కావలసినంత తీరిక. నాకు అందివచ్చిన కూతురుండీ సుఖపడే రాత లేదు. సుగుణమ్మగారి కూతురు మిషన్ ఎంత బాగా కుడ్తుందీ! ఇంట్లో వాళ్ళ బట్టలన్నీ తనే కుట్టేస్తుంది. ఆ పిల్ల అల్లికలు కూడా బాగా చేస్తుంది. అవయినా

కొంచెం నేర్చుకో! రేపు అత్తగారింటికి వెళ్తే మీ అమ్మ నీకేమీ నేర్పలేదా అని నన్నే అంటారు...'' ఇలా సాగేది ఆమె ధోరణి.

పద్దెనిమిదేళ్ళకే పంకజాక్షికి పెళ్లయింది. ఆ మరుసటి ఏడే కొడుకు. మరో రెండేళ్ళకు కూతురు.

భర్త ఉద్యోగం వల్ల పట్టణవాసమయినందున చిన్న చిన్న ఇండ్లలోనే సంసారం సాగిపోయేది. పల్లెటూళ్ళో తను చూసిన పెద్ద పెద్ద ఇండ్లు, విశాలమైన ఆవరణలు ఇక్కడలేవు. పిల్లల కోసం ఆ పెద్ద పెద్ద ఉయ్యాలలూ లేవు. తన ఇద్దరు పిల్లలకూ, స్టాండుతో ఉన్న ఉయ్యాలతోనే సరిపుచ్చుకోవలసి వచ్చింది.

తనకు వయసు వచ్చింది. పెళ్ళయింది. పిల్లలు పుట్టారు. కాని ఉయ్యాలంటే మాత్రం అభిమానం చావలేదు.

అసలది అభిమానం కాదు. తన అంతరాంతరాలలో నిలిచిపోయిన కోరిక అలాగే గడ్డకట్టుకొని స్థిరంగా ఉంది. ఎక్కడ ఉయ్యాల చూసినా పంకజాక్షి మనసు పురి విప్పిన నెమలిలా నాట్యమాడేది. కాని ఉయ్యాల ఊగే భాగ్యం మాత్రం ఎన్నడూ కలగలేదు.

ఒకసారి తమ బంధువుల ఇంట్లో పెళ్ళికి సపరివారంగా వెళ్ళింది పంకజాక్షి. అది ఓ మోస్తరుగా పెద్ద ఊరే. ఆ పెళ్ళింటివారిది బాగా ఉన్న కుటుంబమే. లంకంత ఇల్లు అనేటట్టుంది వాళ్ళ ఇల్లు. ఎన్నో గదులు, వరండాలు, చుట్టూ పెద్ద తోట, ఇంట్లో అన్ని సౌకర్యాలూ ఉన్నాయి. అన్నింటికంటే ముఖ్యంగా చెప్పుకోదగినది ఆ ఇంట్లో ఉన్న ఉయ్యాల బల్ల. పంకజాక్షి కళ్ళన్నీ ఆ ఉయ్యాల బల్ల మీదే ఉన్నాయి. అక్కడున్నవాళ్ళకు దానిపై కూర్చోవటం, ఊగటం అన్నది అతి సాధారణవిషయంగా ఉన్నట్టుంది. ఎవరూ దానిని గురించి అంతగా పట్టించుకున్నట్టే లేదు. ఆ బల్లపై కాస్సేపు కూర్చుందామా అని చాలా సార్లు అనుకొంది పంకజాక్షి. కాని ఇంటి నిండా జనం. ఒక్క క్షణమయినా బల్ల ఖాళీగా లేదు. రాత్రిళ్ళు కూడా ఎవరో ఒకరు దానిమీద పడుకొని నిద్రపోయేవారు.

అప్పుడే నిర్ణయించుకొంది పంకజాక్షి. తాము కట్టే ఇల్లు విశాలంగా ఉండాలని, దానిలో ఒక హాలు, అందులో ఉయ్యాల బల్ల తప్పనిసరిగా ఉండాలనీ అనుకొంది. అప్పుడయితే రోజూ తను కావలసినంత సేపు ఉయ్యాల బల్లమీద కూర్చోవచ్చు. తనిల్లు, తన సంసారం, తనని వద్దని ఎవరంటారు?

కానీ పంకజాక్షి కలలు కలలుగానే మిగిలిపోయాయి. ఎందుకంటే పట్టణాలలో చిన్న ఫ్లాట్లు దొరకటమే గగనం. అదే లక్షలు, లక్షలు చేస్తుంటే ఇక పెద్ద ఇల్లు, అందులో హాలు, హాలులో ఉయ్యాల బల్ల... ఈ జన్మకు మరచిపోవలసిందే. ఇవన్నీ సినిమాలలో చూడవలసిన దృశ్యాలు. నిజ జీవితంలో జరగవు గాక జరగవు అనే చేదు నిజాన్ని గ్రహించింది పంకజాక్షి.

పంకజాక్షి తన జీవితంలో ఎన్నో ఒడిదుడుకులు చూసింది. పిల్లలు పెద్దవాళ్లయ్యారు. వాళ్లకు పెళ్ళిళ్ళయ్యాయి. పిల్లలు పుట్టారు. వాళ్ళ ఆలనా, పాలనా, ముద్దూ ముచ్చటా ఉన్నంతలో బాగానే చూసింది పంకజాక్షి. ఇన్నేళ్ళు గడిచినా ఎక్కడ ఉయ్యాల చూసినా పంకజాక్షి ఒళ్ళుపులకరిస్తుంది. కాని ఉయ్యాలలు మాత్రం ఎక్కడ అగుపిస్తాయి పార్కుల్లో, స్కూళ్ళలో గాక.

పిల్లలను పార్కుకు తీసుకెళ్ళినపుడు వాళ్ళను ఉయ్యాలలో కూర్చోబెట్టి సుతారంగా ఊపేది. ఆ ఉయ్యాల గొలుసులు అపురూపమైనట్లు వాటి స్పర్శతోనే పులకించి పోయేది. "గట్టిగా ఊపు, మరింత గట్టిగా" అని పిల్లలు అరుస్తుంటే ఆ కేరింతలు తనకు గిలిగింతలు పెట్టేవి. అయినా ఒకనాడైనా ఆ ఉయ్యాలలో కూర్చునే సాహసం తను చెయ్యలేదు. "ఇక్కడ ఇందరు పిల్లలుండగా నీకు ఉయ్యాల కావలసి వచ్చిందా తల్లీ" అని ఎవరయినా అడిగితే తను సిగ్గుతో చితికిపోదూ!

ఇప్పుడు కూతురింటికి తను వచ్చింది. ఆ ఇంటి ఎదురుగానే పార్కు. ఆ పార్కులో ఉయ్యాల. ఒకటి కాదు రెండున్నాయి. పిల్లల ఊపుకు అవి కిర్రు కిర్రు మని చప్పుడు చేస్తుంటే పంకజాక్షి చెవులకు అదెంతో శ్రావ్యంగా ఉంటుంది. తను ఇంట్లో ఏ పనిలో ఉన్నా ఈ శబ్దాన్ని సులభంగా గుర్తిస్తుంది. ఒక్కొక్కసారి ఊరంతా నిద్రపోయినపుడు తను బాల్కనీలో నిల్చుని పైన నక్షత్రాలను, కింద లీలా మాత్రంగా కనిపించే ఉయ్యాలను చూస్తూ ఉంటుంది. అవి రిక్తంగా కనిపిస్తుంటే వాటిని చేరుకోలేని తన నిస్సహాయతకు తను నిట్టూరుస్తుంది.

ఈ రోజు సుప్రియ, ఏడేండ్ల పిల్ల. తన మనవరాలు ఎంత నిర్భయంగా, ఎంత స్వేచ్ఛగా ఉయ్యాల ఊగుతోంది! తనకిదెంతో అబ్బురంగా ఉంది. తను అంత ఎత్తునుండి ఎందుకు దూకినట్టు? అందులో ఏమి ఆనందముందో? ఆ పిల్ల నిర్భీతిని మెచ్చుకోవాలి. ఆ పిల్ల సాహసాన్ని మెచ్చుకోవాలి.

ఆ ఏడేండ్ల పాప, అరవై ఏండ్ల పంకజాక్షికి స్వేచ్ఛకు ప్రతీకగా, ఆశకు ప్రతిరూపంగా, విజయకేతనంగా తోచింది. తన జీవితం బావిలో నీళ్లయితే, సుప్రియ గలగల పారుతున్న సెలయేరు. ఆ ఊహ తనకెంతో తృప్తి నిచ్చింది.

ఆ రాత్రంతా పంకజాక్షికి నిద్ర పట్టలేదు. తెల్లవారు ఝామునే మెలకువ వచ్చేసింది. లేచి మొహం కడుక్కొని చల్లగాలికన్నట్టు పార్కులోకి వచ్చింది. ఇంకా జనం ఎవరూ కదలటంలేదు. కాస్సేపట్లో ఒకరి తరువాత ఒకరు వాకింగ్‌కు వచ్చేస్తారు.

ఎదురుగా ఉయ్యాల తనని ఆహ్వానిస్తున్నట్టు పిల్లగాలికి మెల్లమెల్లగా ఊగుతోంది. పంకజాక్షి ఇటూ అటూ చూసి ఏమయితే అది కానిమ్మని ఉయ్యాలపై కూర్చుంది. శరీరమంతా పులకించి పోయింది. చిన్న పిల్లకులా నవ్వు తన్నుకు వస్తోంది. పెదాలు బిగపట్టి తను నవ్వు ఆపుకొంటోంది. మొదట్లో కాస్త బెదురుగా, మెల్లగా ఊగింది. తర్వాత కాస్త గట్టిగా ఊగింది. ఆ తర్వాత మరి కొంచెం ఊపు. మేఘాలమీద తేలిపోతున్నట్టు, ఆనందతరంగాల మీద పయనిస్తున్నట్టు- అదో అనుభూతి. ఇది ఏనాటి అనుభవం! ఏభై ఏళ్ళు వెనక్కి వెళ్ళినట్టుంది. పసితనం తిరిగి వచ్చినట్టుంది. తమ వూరు... చింతచెట్టు... దానికి ఊయల... తను ఊగటం... అరె... ఇదేమిటి తను ఇంతింత పైకి పోతోందేమిటి? కళ్ళు తిరగవు కదా! పట్టు తప్పదు కదా! అనుకోకుండా కళ్ళు మూసుకుంది.

కిలకిలా నవ్వు వినిపించింది. చిన్నారి చేతుల స్పర్శ. "అమ్మమ్మా, నిన్ను నేను బాగా పైకి ఊపేస్తాను. గట్టిగా ఊపేస్తాను. జాగ్రత్త. భయపడకు. పట్టు విడిచిపెట్టకు. నేనిక్కడే ఉన్నాను. నీకేం భయంలేదు. రెడీ..." అంటోంది సుప్రియ.

భూమిక మాసపత్రిక
మార్చి - ఏప్రిల్ 2002